క్లుప్తంగా

పచ్చిక బయళ్లను ఆక్రమిస్తే చర్యలు



బోర్డు ఏర్పాటుచేసిన రెవెన్యూ అధికారులు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్ సమీపాన పచ్చిక బయళ్లను ఎవరైనా ఆక్రమించుకున్నా, వ్యవసాయం చేసినా, నిర్మాణాలు చేపట్టిన కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి హెచ్చరికలు జారీ చేశారు. ఈ మేరకు ఆయన కొండ ప్రాంతలలో హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేయించారు. సర్వే నంబర్ 362లో విస్తరించిన పచ్చికబయళ్లపై కోర్టు వివాదంలో ఉన్న నేపథ్యంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించామని తెలిపారు.

గోధుమపిండి లారీ బోల్తా



పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని డొంగుల వద్ద ఆదివారం తెల్లవారుజామున గోధుమ పిండి లారీ బోల్తాపడింది. హైదరాబాద్ నుంచి పాండిచ్చేరికి వెళ్తున్న ఈ లారీప్రమాదవశాత్తు డివైడర్ ఎక్కి బోల్తా పడడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. హైవే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గోధుమ పిండి బస్తాలను మరో లారీలోకి లోడ్ చేయించి వాహనాన్ని తొలగించి ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు.

భోగేశ్వరంలో భక్తుల సందడి



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

గడివేముల: దుర్గాభోగేశ్వరాలయంలో కార్తీక మాసం ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి తరలిరావడంతో ఆ ప్రాంతం కిటకిటలాడింది. పంచ కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు శ్రీ దుర్గాభోగేశ్వరుడి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో కార్తీకదీపాలు వెలిగించి శివ నామం స్మరించారు. అనంతరం భక్తులు కాశీనాయన ఆశ్రమంలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

పుస్తకపఠనం అలవర్చుకోవాలి



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

ఓర్వకల్లు: విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని గ్రంథాలయ అధికారిణి కౌసల్య సూచించారు. మండలంలోని నన్నూరు శాఖ గ్రంథాలయంలో ఆదివారం 'చదవటం మాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సెలవు దినాల్లో గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలు, దినపత్రికలు, నవలలు చదువాలని సూచించారు. ప్రతి పుస్తకంలో జీవితానికి సంబంధించిన సందేశం ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు.

ప్రజా సమస్యలు గాలికి



ప్రజలతో మాట్లాడుతున్న కాటసాని

పాణ్యం: టీడీపీ కూటమి సర్కార్ ప్రజా సమస్యలను గాలికొదిలేసిందని నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం ఆలమూరు గ్రామంలో జరిగిన ఓ శుభకార్యక్రమానికి కాటసాని హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామప్రజలు వివిధ సమస్యలను మాజీ ఎమ్మెల్యే కాటసాని దృష్టికి తీసుకొచ్చారు. టీడీపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. సమస్యలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంక్షేమం అమలు చేస్తున్నామని పలికే కూటమిన పెద్దలు కేవలం ప్రచారాలకే పరిమితమయ్యారని విమర్శించారు. వృద్ధులకు అందించే పింఛన్‌లను సైతం అర్హులకు తొలగించి అన్యాయం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న చిన్న సమస్యలు పెద్దవిగా చూపిస్తూ పింఛన్‌దారులు జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. అసలు పింఛన్ ఎందుకు తొలగించారో చెప్పే నాథుడు కరువయ్యారన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు సద్దల సూర్యనారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ షరీఫ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కరుణాకర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, ఉపేంద్రారెడ్డి, దేవేంద్రారెడ్డి, శేఖర్‌రెడ్డి , గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకేదీ 'బీమా' ధీమా ?

- ఉచిత పంటల బీమా పథకానికి కూటమి సర్కార్ మంగళం
- సాగుచేసిన పంటలకు రైతులే ప్రీమియం చెల్లించాలంటూ ఉత్తర్వులు
- గత ప్రభుత్వంలో రూపాయి చెల్లించకుండా రైతులకు లబ్ధి



కోడుమూరులో రబీలో సాగు సాగు చేసిన శనగ పంట



అధిక వర్షాలకు నీటమునిగిన ఉల్లి పంట

పంట	ఎకరాకు చెల్లించాల్సింది రూపాయల్లో
వరి	630
శనగ	420
వేరుశనగ	480
జొన్న	297
ఉల్లి	1350

కోడుమూరు రూరల్ : సీఎం చంద్రబాబు నాయుడుకు రైతులంటే చిన్న చూపేనని మరోసారి నిరూపించుకున్నారు. గతంలో వ్యవసాయం దండగని వ్యాఖ్యానించి రైతుల వ్యతిరేకతను చవి చూసిన బాబు మళ్లీ తన నైజాన్ని చాటుకుంటూనే ఉన్నారు. ఖరీఫ్ సీజన్‌కు పెట్టుబడి సాయం అందించాల్సిన సీఎం చంద్రబాబు మొండిచేయి చూపి దండగ వ్యవసాయానికి సాయం ఎందుకనే తనతీరును చెప్పకనే చెబుతున్నారు. పెట్టుబడి సాయం అందక, వర్షాభావ పరిస్థితుల మూలంగా కొట్టుమిట్టాడుతున్న రైతులపై మరోభారం మోపారు. ఉచిత పంటల బీమా పథకానికి మంగళం పాడేశారు. దీంతో రైతులు, రైతు సంఘాల నేతలు కూటమి సర్కార్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతులు తమ పంటలకు ప్రీమియం చెల్లిస్తేనే బీమా వర్తిస్తుందని తేల్చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులపై పైసా భారం పడకుండా ఐదేళ్లపాటు విజయవంతంగా ఉచిత పంటల బీమాను అమలు చేసింది. దీంతో తీవ్రమైన వర్షాలు, వరదల వల్ల పంటలకు నష్టం వాటిల్లినప్పుడు పరిహారం రూపంలో రైతులను ఆదుకునేందుకు పంటల బీమా పథకం ఎంతగానో ఉపయోగపడేది. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తేసి రైతులే తమ పంటల బీమాకు సంబంధించిన ప్రీమియం చెల్లించుకోవాలని ప్రకటించింది. ఇప్పటికీ చాలామంది రైతులకు బీమాకు సంబంధించిన ప్రీమియం ఎలా కట్టాలో తెలియని పరిస్థితి. ఖరీఫ్ సీజన్‌లో నష్టాలు మూటగట్టుకున్న రైతులు ప్రీమియం ఎలా చెల్లించాలంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

కష్టాల్లో అన్నదాతకు అండగా నిలిచిన జగనన్న

రైతుపై ప్రీమియం భారం పడకుండా ఉండేందుకు జగనన్న తన ప్రభుత్వ హాయంలో 2019 ఖరీఫ్ నుంచి ఉచిత పంటల బీమా పథకాన్ని అమలుల్లోకి తెచ్చింది. పంట నమోదు ఆధారంగా సాగు విస్తీర్ణం అంతటికి రైతులు చెల్లించాల్సిన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తూ వచ్చింది. దీని వలన పంటల బీమా పథకం గురించి రైతులకు ఇబ్బందులు తప్పేవి. సాగు చేసిన ప్రతి ఎకరాకు బీమా పథకం వర్తించడంలో పంట నష్టం వాటిల్లినప్పుడు రైతులతో పాటు గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందేది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కోడుమూరు నియోజకవర్గంలో 57,164మంది రైతులకు రూ.385.85 కోట్ల వరకు పంట నష్టపరిహారం చెల్లించింది.

ప్రభుత్వమే పంటల బీమాకు ప్రీమియం చెల్లించాలి



రాష్ట్ర ప్రభుత్వమే పంటల బీమాకు సంబంధించిన ప్రీమియం చెల్లించాలి. గతంలో జగనన్న ప్రభుత్వం పంటల బీమాకు సంబంధించిన ప్రీమియం చెల్లించి పంటలు నష్టపోయిన సందర్భాల్లో రైతులకు పరిహారాన్ని చెల్లించి ఆదుకునేది. దీంతో పంటలు నష్టపోయనప్పటికీ రైతుకు పరిహారం రావడంతో ఎంతో ధీమాగా ఉన్నారు. నేడు కూటమి ప్రభుత్వం రైతులే పంటలకు సంబంధించి ప్రీమియం చెల్లించాలని పెట్టడంతో చాలామంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

–నవీన్‌కుమార్‌రెడ్డి, కోడుమూరు

గడువులోగా ప్రీమియం చెల్లిస్తేనే బీమా

రబీలో నోటిఫై చేసిన పంటలకు ప్రభుత్వం నిర్దేశించిన మొత్తం గడువులోగా రైతులే ప్రీమియం చెల్లించాలి. రైతులు సాగు చేసిన శనగ, జొన్న, వేరుశనగ, ఉల్లి, టమోట పంటలకు డిసెంబర్ 15లోపు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా వరి పంటకు డిసెంబర్ 31 వరకు ప్రీమియం చెల్లించొచ్చు. ప్రీమియం చెల్లిస్తే పంటలకు నష్టం వాటిల్లినప్పుడు బీమా వస్తుంది.

– రవిప్రకాష్, ఏఓ కోడుమూరు

6న బహిరంగ వేలం

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో ఏడాది పాటు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు ఈ నెల 6వ తేదీన వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓ మద్దిలేటి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవస్థానం ప్రాంగణంలో టెంకాయలు, వాహనాల పార్కింగ్, ఐస్‌క్రీమ్ విక్రయం, టెంకాయ చిప్పలు పోగు, తదితర షాపుల నిర్వహణకు బహిరంగా వేలం నిర్వహిస్తున్నామన్నారు. అదేవిధంగా దేవస్థానం భూమి సర్వే నంబర్ 433/కె2లోని 4.36 ఎకరాల విస్తీర్ణంలోని మామిడి తోటలో ఫలసా యం పొందుటకు వేలం పాటు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నిర్దేశించిన డిపాజిట్ సొమ్మును చెల్లించి ఉదయం 10 గంటలకు జరిగే బహిరంగ వేలంలో ఆసక్తి వ్యక్తులు పాల్గొనాల్సి ఉంటుందని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని చెంచు కాలనీ వద్ద ఫ్లైఓవర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదివారం రాత్రి వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. ఫ్లైఓవర్‌పై రాంగ్‌రూట్‌లో ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తిని నంద్యాల నుంచి కర్నూలు వైపు వెళ్తున్న తుఫాన్ వాహనం ఢీకొనడంతో అక్కిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. అయితే మృతుడికి సంబధించి ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడు నీలిరంగు చొక్కా, ఎర్రటి షాట్ ధరించినట్లు తెలిపారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

సి.బెళగల్: స్థానిక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండల అధికారులతో కలిసి నిర్వహించే కార్యాక్రమంలో ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేసి పరిష్కరించుకోవాలని సూచించారు.

రక్తదానం



రక్తాదానం చేస్తున్న యువకులు

కర్నూలు రూరల్ : మండల పరిధిలోని జి. సింగావరం గ్రామంలో ఆదివారం డీవైఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురుస్కరించుకుని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రఘువేంద్ర, గ్రామ కార్యదర్శి సురేష్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 40 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రాము యువతను ఉద్దేశించి మాట్లాడారు. రక్తదానాన్ని మించిన దానం మరొకటి లేదన్నారు. ప్రాణదానంతో సమానమైన రక్తదానాన్ని చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు హుసేనయ్య, డీవైఎఫ్‌ఐ నాయకులు అబ్దుల్లా, మండల నాయకులు అంజి, దివాకర్, శశి, పెద్దయ్య, కాజా, మల్లేష్, బజారి తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం



తాండ్రపాడు రాణి

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్ చెందిన బాలిక అదృశ్యం కావడంపై తల్లిదండ్రులు ఆదివారం స్థానిక పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన ఎస్‌ఐ తిమ్మారెడ్డి వివరాలను వెల్లడించారు. ఎస్సీ కాలనీలో నివాముండే తాండ్రపాడు హనుమన్న కుమార్తె తాండ్రపాడు రాణి ఆదివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లింది. బాలిక తిరిగి ఇంటికి రాకపోవడంతో చర్చి వెళ్లి ఉంటుందని భావించిన తల్లిదండ్రులు మధ్యాహ్నం వరకు వేచి చూశారు. అయినా రాకపోవడంతో స్థానికులు, బంధవులను తండ్రి విచారించారు. పదహారేళ్ల బాలిక బయటకు వెళ్లేప్పుడు ఆరెంజ్ కలర్ గౌను, ఎరుపురంగు చున్నీ ధరించి ఉందని ఎస్‌ఐ చెప్పారు. ఆచూకి తెలిసిన వ్యక్తులు తన నంబర్ 9121101070కు ఫోన్ చేయాలని ఎస్‌ఐ సూచించారు.

పాముకాటుతో బాలిక మృతి



సంధ్య (ఫైల్)

సి.బెళగల్: సి.బెళగల్ మండలంలోని తిమ్మందొడ్డి గ్రామంలో పాముకాటుతో ఏడేళ్ల బాలిక మృతి చెందింది. గ్రామస్తుల సమాచారం మేరకు పునరావాస బీసీ కాలనీ గుడిసెలో నివాసముంటున్న వెంకటేష్, మహేశ్వరమ్మ దంపతులకు కుమార్తె సంధ్య (7), కుమారుడు. శనివారం రాత్రి భోజనం అనంతరం గుడిసెలో నిద్రిస్తుండగా సంధ్యా చేతిని ఏదో కరిచినట్లు అనిపించడంతో తల్లిదండ్రులకు తెలిపింది. సంధ్యకు గ్రామంలో నాటు వైద్యం చేయించారు. అయితే పాము కరచినచోట నొప్పి ఎక్కువ కావడంతో అర్ధరాత్రి అనంతరం మరో గ్రామంలోని తమ బంధువుల దగ్గర సైతం నాటు వైద్యం చేయించారు. బాలిక పరిస్థితి మిరింత విషమించడంతో ఎమ్మిగనూరులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రైవేట్ వైద్యుడు సూచన మేరకు ఆదివారం వేకువజామున మూడు గంటల సమయంలో అంబులెన్స్‌లో కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్య బాలికి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.


ఆదమరిస్తే అంతే సంగతులు



రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గోతి సమీపాన వెళ్తున్న వాహనచోదకుడు

కర్నూలు (రూరల్) : కర్నూలు–గుంటూరు ప్రధాన రోడ్డును నంద్యాల చెక్‌పోస్టు నుంచి గార్గేయపురం వరకు సింగిల్ రోడ్డును డబుల్ లైన్‌గా నిర్మిస్తున్నారు. అయితే వెంకాయపల్లె ఎల్లమ్మ అమ్మవారి ఆలయ సమీపాన రహదారిపై వంతెన సగం నిర్మించారు. మరి కొంత నిర్మించాల్సి ఉంది. వంతెనపై ఉన్న గుంతను పూడ్చలేదు. తాత్కాలిక డివైడర్‌లా ఏర్పాటు చేశారు. అది కూడా కింద పడిపోయి ఉన్నా పట్టించుకునేవారు లేరు. ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. విద్యాసంస్థలు ఉండడంతో విద్యార్థులు నిత్యం ఈ రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తుంటారు. ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదానికి గురికావాల్సిందే. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

పొంచివున్న ప్రమాదం



మండల కేంద్రం గడివేములలోని బొల్లవరం రస్తాలో విద్యుత్ స్తంభం రూపంలో ప్రమాదం పొంచివుంది. ఓ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ స్తంభం విరిగి ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు భయాందోళన చెందుతున్నారు. కొన్ని రోజుల నుంచి స్తంభం విరిగి ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి విరిగిన స్తంభం స్థానంలో కొత్తది ఏర్పాటు చేయించాలని రైతులు కోరుతున్నారు. –గడివేముల



గడివేముల పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విరిగిన విద్యుత్ స్తంభం

ఇకపై పగటిపూటే తాగునీటి సరఫరా

- కర్నూలు కార్పొరేషన్‌లో 22 ఏళ్లనాటి సమస్యకు మోక్షం
- తాగునీటి సరఫరా వేళల్లో మార్పులు
- ప్రణాళికలు రూపొందించిన నగరపాలక అధికారులు
- వచ్చే నెల నుంచి కోడుమూరు అర్బన్ పరిధిలో ప్రతిరోజు నీటి సరఫరా



వాల్వ్, పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



ఉదయం వేళ నీటిని పట్టుకుంటున్న మోసస్ కాలనీ ప్రజలు

కర్నూలు (టౌన్): కర్నూలు మున్సిపాల్టీని 2002 సంవత్సరంలో కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేశారు. కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీని విలీనం చేశారు. ఎన్నో గ్రామాలు విలీనం అయ్యాయి. అయితే ఇప్పటివరకు మంచినీటి సరఫరా వేళల్లో ఎన్నో సమస్యలు ఉన్నాయి. ఎంతో మంది పాలకులు వచ్చారు. పాలక వర్గాలు వచ్చాయి. సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోలేదు. కర్నూలు నియోజకవర్గం పరిధిలో ప్రతి రోజు నగరపాలక యంత్రాంగం తాగునీటిని సరఫరా చేస్తోంది. విలీనం అయినా కల్లూరు గ్రామ పంచాయతీతో పాటు స్టాంటన్‌పురం, మామిదాలపాడు, మునగాలపాడు, పెద్దపాడు, లక్ష్మీపురం , పందిపాడు గ్రామాలకు మాత్రం రోజు విడిచి రోజు తాగునీటిని సరాఫరా చేస్తున్నారు. అవికూడా సక్రమంగా రాకపోవడంతో శివారు కాలనీల ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. అర్ధరాత్రి 1 గంటకు, 2 గంటలకు ఇలా.. అనేక కాలనీల ప్రజలు రాత్రి పడుకోకుండా తాగునీటిని పట్టుకునేందుకు ఇబ్బందులు పడేవారు. అయితే పాలకులు, అధికారులు ఈ సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. నగరంలోని కల్లూరు పరిధిలోని 16 వార్డులు, కోడుమూరు అర్బన్ పరిధిలోని 3 వార్డులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లు ఇదే సమస్యపై కౌన్సిల్‌లో లేవనెత్తేవారు. సమస్య పరిష్కరించాలని స్థానిక వార్డు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. దీనిపై నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు కసరత్తు చేశారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. 133 సచివాలయాల పరిధిలో ఉన్న సివిల్ ఇంజినీర్లకు బాధ్యతలు అప్పగించారు. తాగునీటి సమస్య, పరిష్కారం, వాల్వ్‌లు, నీటి సరఫరాలో ఇబ్బందులు, లీకేజీ సమస్యలను పరిష్కరించే విధంగా సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది.

సచివాలయాల సిబ్బందికే బాధ్యతలు

నగరపాలకలోని 133 సచివాలయాల పరిధిలోని సివిల్ ఇంజినీరింగ్ ఉద్యోగులు ఇంజినీరింగ్ విభాగంలోని వాటర్ వర్క్స్, రిపేర్లు, నీటి సరఫరా, పార్కుల నిర్వహణ, అభివృద్ధి పనుల పర్యవేక్షణ ఇలా.. దాదాపు అన్ని పనులను పర్యవేక్షిస్తున్నారు. ప్రతి సచివాలయం పరిధిలో ఇంటింటికీ వెళ్లి మంచి నీటి సరఫరాను పరిశీలించడం, నీటి శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపడం, లీకేజీలను అరికట్టడం, స్థానిక కాలనీల ప్రజలతో నేరుగా మాట్లాడటం వంటి అంశాలపై దృష్టి పెట్టారు. గతంలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ట్యాప్ ఇన్‌స్పెక్టర్లు ఈ పనులు చేసేవారు. అయితే అవినీతి ఆరోపణలు రావడం, ఇష్టమొచ్చిన సమయంలో నీటిని సరఫరా చేయడం, డబ్బులు తీసుకొని ఎక్కువ సమయం వదలడం, అపార్టుమెంట్లు, వాణిజ్య భవనాలకు మీటర్ కనెక్షన్లు లేకున్నా నీటిని సరఫరా చేయడం, అనధికారిక కుళాయి కనెక్షన్లు ఇవ్వడం ఇలా ట్యాప్ ఇన్‌స్పెక్టర్లు ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు సైతం పైరవీలు చేయడం, అభివృద్ధి పనులను విస్మరించడం, కాంట్రాక్టర్ల అవతారం ఎత్తడం, బినామీ ఉద్యోగులను నియమించడం వంటి ఆరోపణలు రావడంతో వీరందరినీ పక్కన పెట్టారు. వారి స్థానంలో సచివాలయాల ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఇప్పుడిప్పుడే సమస్యలు గాడిన పడుతున్నాయి.

సంపుల సమస్యకు స్వస్తి

అనేక కాలనీలలో 50 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన సంపులను ఏర్పాటు చేసుకొని గంటల కొద్ది నీటిని మోటార్ల ద్వారా వాడుకుంటున్నారు. కనెక్షన్ ఒకటి ఉంటే ఇంట్లో 4 నుంచి 5 కుళాయిలు ఉంటున్నాయి. ఇలా కొన్ని కాలనీలకు మంచినీటి సరఫరాలో ఇబ్బందులు వస్తున్నాయి. దీన్ని గుర్తించిన అధికారులు ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన ప్రకారం 100 నుంచి 135 లీటర్ల వరకు నీటిని ఇవ్వాల్సి ఉంది. ఆ లెక్కల ప్రకారం అందరికీ నీటిని సరఫరా చేయాలని ఇంజినీరింగ్ అధికారులు నిర్ణయించారు.

వచ్చే నెల నుంచి కోడుమూరు అర్బన్‌లో ప్రతిరోజు నీటి సరఫరా

వచ్చే నెల నుంచి కోడూమూరు అర్బన్ పరిధిలోని 38, 39, 40 వార్డులకు ప్రతి రోజు మంచినీటిని సరఫరా చేసే విధంగా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. ఆ దిశగా పనులకు ఇప్పటికే శ్రీకారం చుట్టారు. రెండు రోజులకు ఒకసారి నీటిని విడుదల చేయడం నుంచి ప్రతిరోజు నీటిని సరఫరా చేయడం , పగలు మాత్రమే నీటిని సరఫరా చేయడంపై స్థానిక కాలనీ వాసులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రాత్రి వేళ తాగునీటి సరఫరాకు చెక్

కార్పొరేషన్ పరిధిలోని అనేక కాలనీలలో రాత్రి వేళల్లో మంచినీటిని సరఫరా చేసేవారు. స్టాంటన్ పురం, వీకర్ సెక్షన్ కాలనీ ఈఎల్‌ఎస్‌ఆర్ పరిధిలోని కాలనీలకు రాత్రి, అర్ధరాత్రి 12 గంటలకు, 1 గంటకు ఇలా.. సరఫరా వేళలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీలలో 80 శాతానికిపైగా లేబర్ పనులు చేసేవారు ఉన్నారు. వీరంతా అర్ధ రాత్రి మంచినీటిని పట్టుకోవాలంటే ఇబ్బందులు పడేవారు. తెల్లవారుజామున పనులకు వెళ్లాల్సి ఉంటుంది. ఇలా ఎన్నో సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యలకు చెక్ పెడుతూ ఇంజినీరింగ్ అధికారులు సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు. రాత్రి వేళ నుంచి తప్పించి ఉదయం 5 గంటల నుంచి మంచినీటి సరఫరా చేసేలా చర్యలు చేపట్టారు. ఇప్పటికే ఈ పనులు పూర్తి చేశారు. రెండు వారాలుగా నగరపాలక ఇంజినీరింగ్ విభాగం అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటున్నారు. ఇక నాలుగవ పట్టణ పోలీసుస్టేషన్ ఎదురుగా నిర్మల్ నగర్ నుంచి గుత్తి పెట్రోల్ బంకు సమీపంలోని మిస్టర్ ఇడ్లీ వరకు రాత్రి వేళ నీటి సరఫరా నుంచి విముక్తి చేసే చర్యలు ప్రారంభమయ్యాయి. త్వరలోనే ఈ కాలనీలన్నింటికీ ఉదయం వేళ మంచినీటిని సరఫరా చేయనున్నారు.